# నిర్ణయం

పెళ్లికి సరిగ్గా వారం మాత్రమే వ్యవధి వుందనగా మగపెళ్లి వారి నుంచి ఆ కబురొచ్చింది. ఎవరూ ఊహించని పరిణామం. దానితో ఆ ఇంట్లో పెళ్లి వాతావరణం ఒక్కసారిగా చప్పబడిపోయింది. ఏ ఒక్కరి ముఖంలో నెత్తురు చుక్కలేదు. ఇకముందేం జరుగబోతుందన్న ఉత్కంఠ అందరి మనసుల్లో చోటు చేసుకుంది.



దాదాపు సగంపైనే పెళ్లి శుభలేఖలు బంధుమిత్రులకు పంచటం జరిగింది. దగ్గర బంధువులు ఒక్కొక్కరుగా రావటం కూడా మొదలైంది. కుటుంబ గౌరవానికి తగ్గట్టు పెళ్లి ఏర్పాట్లు ఘనంగానే వున్నాయి. డబ్బు మంచినీళ్లలా ఖర్చయిపోతున్నది.

మధ్యవర్తి ఆ కబురు మోసుకొచ్చి చెప్పిన దగ్గర్నుంచి ఇంట్లో అందరికీ మతి లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో అంతుబట్టటం లేదు,

"ఈ ఖర్మేంటండీ! బంగారంలాంటి సంబంధం...పిల్ల సుఖపడుతుందని సంతోషిస్తుంటే ఇలా జరిగిందేంటండీ?" కౌసల్య సతమతమవుతున్నది.

పరాత్పరరావు ఈ విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నాడు. ఎవర్ని తప్పుబట్టాలో, నిందించాలో అర్థం కాలేదు. అశక్తత, కోపం అతని మనస్సును బండబారేలా చేశాయి. అతని మనస్సు ఆందోళనకు గురైంది. ఇందులో ఏమన్నా కుట్రగాని, కుతంత్రంగాని వుందేమోనన్న అనుమానం మొదట పొడ చూపింది. సంబంధం కుదిర్చిన మధ్యవర్తి అపరిచితుడేం కాదు. ఉభయులకూ కావల్సిన మనిషి. నమ్మదగినవాడు.

ఇరవై నాలుగ్గంటల వ్యవధి...' ఆడపెళ్లి వాళ్లు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా మగ పెళ్లివాళ్లు దానికి కట్టుబడి సహకరిస్తారు. జరిగిన నష్టానికి కొంత బాధ్యత తీసుకోవటానికీ సిద్ధంగా వున్నారు. ఇచ్చి పుచ్చుకొన్న లాంఛనాల విషయంలో ఆడ పెళ్లివాళ్లు ఎలాగంటే అలా సర్దుకుపోవటానికి ఎలాంటి ఇబ్బంది పెట్టబోమని చెప్పి పంపారు. ఆ విషయంలో వాళ్లు బాగా నిక్కచ్చిగా వున్నారు.

గంటలు గడుస్తున్న కొద్దీ పరాత్పరరావులో నరాలు తెగే టెన్షన్. అంత సులువుగా తేల్చ గలిగిన వ్యవహారం కాదు. ఏం జరగాలనుంటే అలా జరుగుతుందన్న మొండి ధైర్యంతో ఆ పైవాడి మీద భారం వేసి చేతులు దులుపుకునేటంత చిన్న విషయం కాదు. ఎలాంటి తొందరపాటు నిర్ణయం తీసుకున్నా పిల్ల భవిష్యత్తు నాశనమవుతుంది.

మంచి కుటుంబం, అమ్మాయి చక్కనిది, చదువుకుంది, బుద్ధిమంతురాలన్న ఉద్దేశంతో ఊర్మిళను తమ ఇంటి కోడల్ని చేసుకోవాలని చాలమంది తాపత్రయ పడ్డారు. ప్రయత్నాలు చేశారు కూడాను.

పెద్ద ఉద్యోగాలు చేస్తున్న వాళ్లవి, వ్యాపారంలో బాగా రాణిస్తూ స్థితిపరులైన వాళ్లవి, మ్యారేజీ ప్రపోజల్స్ ఎన్ని వచ్చినా పరాత్పరరావు ఆలోచన ఒకటే. కూతురికి అమెరికా సంబంధం చూడాలి. పెళ్లి చేసి వెంటనే అమెరికా పంపాలి.

అదనీ.... ఇదనీ.... రెండేళ్లపాటు ఎన్నో సంబంధాలు విచారించి, అమెరికాలో ఇంజనీర్‌గా చేస్తున్న సురేంద్ర సంబంధం అన్ని విధాల బాగుందని అనుకున్నాడు. పెళ్లి చూపులయ్యాయి... పిల్లా, పిల్లాడు ఒకరినొకరు ఇష్టపడ్డారు. మేడ్ ఫర్ ఈచ్ అదర్ అనుకుంటూ అటూ ఇటూ పెద్దలు మురుసుకున్నారు. తాంబూలాలు ఇచ్చి పుచ్చుకొని శ్రావణమాసలగ్నాల్లో పెళ్లనుకున్నారు...

పెళ్లికి నాలుగైదు రోజులు ముందు పిల్లాడు రాగలడన్నారు. అయితే ఒక వారం ముందుగానే సురేంద్ర ఇండియా వచ్చాడు. అతడు వస్తూనే ఆడపెళ్లి వాళ్లకు మధ్యవర్తి తెచ్చిన కబురు అశానిపాతం అయింది.

అమెరికాలో సురేంద్రకు ఉద్యోగం పోయింది. అక్కడే మరో ఉద్యోగం సంపాదించి సెటిలయ్యే దారేదీ కనిపించక తట్టాబుట్టా సర్దుకుని ఏకంగా ఇండియా వచ్చేశాడు. ఇండియాలోనే ఏదో ఉద్యోగం చూసుకోవాలి... ఆడ పెళ్లివాళ్లు వద్దనుకుంటే పెళ్లి కాన్సిల్ చేసుకోవచ్చు... మధ్యవర్తి మాటలకు పరాత్పరరావు ఉగ్రుడయ్యాడు. "ఇదేవన్నా బొమ్మల పెళ్లనుకొన్నారా? పీటల మీదికొచ్చిన పెళ్లి ఆగిపోవటం అంటే ఎంత అప్రదిష్ట? నలుగురికీ ఏం సమాధానం చెప్పాలి?" మధ్యవర్తి మీద ఎగిరిపడ్డాడు.

"కుర్రాడు ఇండియాకొస్తూనే చెప్పిన మొదటి మాట, ఉద్యోగం పోయిందని... వెంటనే మీకు తెలియపరచమన్నాడట... తల్లిదండ్రులూ ఒక రోజంతా గుంజాటన పడ్డారు. అసలు చెప్పాలా? వద్దా? అని... పిల్లవాడు విషయం దాచటానికి ఇష్టపడలేదు" చెప్పాడు మధ్యవర్తి.

"పోలీసు కేసు పెట్టి కోర్టుకీడుస్తాను. నలుగురిలో నవ్వులపాలు జేస్తాను".

"కేసులూ, కోర్టులూ ఈ సమస్యను పరిష్కరిస్తాయా చెప్పండి..."

"వీళ్లకంతా సంబంధం కుదుర్చుకోకముందే తెలుసు. ఉద్యోగం పోయిన విషయం దాచి ఈ నాటకం అంతా ఆడినట్లుంది. ఇంతదాకా వచ్చాక పరువు ప్రతిష్టల కోసమైనా చచ్చినట్లు కట్టుబడి వుంటారని వాళ్ల ఎత్తుగడ".

"ఎత్తుగడయితే ఇప్పుడే చెప్పడం దేనికి? పెళ్లయ్యాకే విషయం నింపాదిగా చెప్పొచ్చుగా!" పరాత్పరరావు దిగాలు పడిపోయాడు. వంచనో, నిజాయితీనో తేల్చుకోలేని దురవస్థ....

"అమెరికాలో డబ్ల్యు.టి.సి. భవంతుల మీద సెప్టెంబర్ 11న ఉగ్రవాదుల దాడి తర్వాత అక్కడ ఎన్నో విపరీత పరిణామాలు చోటు చేసుకున్నాయి. హఠాత్తుగా ఏర్పడిన ఆర్థిక మాంద్యాన్ని చక్కదిద్దుకునే ప్రయత్నాల్లో ఎన్నో కంపెనీలు ఉద్యోగాలను పరిమితం చేశాయి... వేతనాలు తగ్గించాయి. పని గంటలు పెంచాయి. అప్పట్లో వేలాదిమంది ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. ఇప్పటికీ అక్కడి పరిస్థితులు చక్కబడలేదు. ఎప్పుడు ఎవరివంతు వస్తుందో చెప్పలేం. ఇప్పుడు దురదృష్టం కొద్దీ సురేంద్ర వంతొచ్చింది.

అనుకోకుండా జరిగిన విపరీత పరిణామం ఇదంతా. అంతకు మించి కుట్రాడి ఉద్యోగం విషయంలో కుట్రా, కుతంత్రమూ లేదని నా నమ్మకం. ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో మీ ఇష్టం. ఇరవై నాలుగ్గంటంల్లో డిసైడ్ చెయ్యండి..." వివరంగా చెప్పి వెళ్లాడు మధ్యవర్తి.

ఊర్మిళకు అమెరికా సంబంధం చేసుకోవాలని ఎంతో పట్టుదలతో వ్యవహరించి చివరకు ఇలా రాజీపడాల్సిన పరిస్థితిని పరాత్పరరావు జీర్ణించుకోలేకపోతున్నాడు. బంగారంలాంటి సంబంధాలు తెస్తే కాదని, అమెరికా మోజులో మిడిసిపడ్డందుకు మంచి ఎదురు దెబ్బే తగిలిందని, నలుగురూ నవ్వుకోరా?

ఎవరెలా అనుకుంటేనేం? కూతురి భవిష్యత్తు ముఖ్యం. ఈ సంబంధం కాన్సిల్ చేసి నెల తిరక్కుండానే మరో మంచి సంబంధం చూసి పెళ్లిచేస్తే తప్పేంటి? నాలుగు రోజులు ఎవరికి తోచినట్లు వాళ్లనుకుంటారు. ఆ తర్వాత వాళ్లే మరిచిపోతారు.

"పీటల మీదికొచ్చిన పెళ్లాగిందంటే లోకులు ఎన్ని రకాలుగా అనుమానిస్తారో మీకేం తెలుసండీ.... ముక్కూ మొఖం తెలియని వాళ్లు చెప్పింది ఒక పట్టాన నమ్ముతారా... పిల్లను చేసుకుంటారా?" కౌసల్య ఏడుపు.

"ఎందుకు నమ్మరే! అబ్బాయికి అమెరికాలో ఉద్యోగం వుందని ఖాయ పరుచుకున్నాం... తర్వాత కుట్రాడి ఉద్యోగం పోయిందని తెల్సి ఆ సంబంధం వొదులుకున్నామని చెప్తాం. ఎంక్వయిరీ చేసుకుంటే వాళ్లకు మాత్రం నిజం తెలియదా?"

"మీరనుకొంటున్నంత తేలిక కాదండీ నమ్మించడం.. రెండో పెళ్లిదాన్ని చూసినట్లు తేలికచేసి మాట్లాడతారు. కట్నాలనీ, కానుకలనీ, లాంఛనాలనీ వేపుకు తింటారు. ఈ రోజుల్లో అన్నీ సక్రమంగా వుంటేనే ఒక పట్టాన పెళ్లిళ్లు కుదుర్చుకోలేకపోతున్నాం".

"అసలేంటే నీ ఉద్దేశ్యం. చచ్చినట్టు ఈ సంబంధమే చేసుకోవాలంటావా? పరువు ప్రతిష్టలనుకుంటూ, ఉద్యోగం సద్యోగం లేనివాడ్ని పిల్లకు చేసి, ఇల్లరికం వుంచుకొని జీవితాంతం పోషిస్తూ చావాలా?" ఇంతెత్తున లేచాడు భార్య మీద పరాత్పరరావు.

"అవున్లెండి...బిడ్డల్ని కని పెంచటం తప్పితే నాబోటి ఆడవాళ్ళ మాటలకు ఏమన్నా విలువా? చెల్లుబాటా? తండ్రీ కూతుళ్లు ఏం ఆలోచించుకుంటారో, ఏం చేసుకుంటారో మీ ఇష్టం" అంటూ కౌసల్య కంటనీరు పెట్టుకుంది.

ఈ పరిస్థితుల్లో తన పెళ్లి గురించి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో దిక్కుతోచక తల్లిదండ్రులు సతమతమవుతున్న విషయం ఊర్మిళ గ్రహించింది. ఇప్పటికైనా తను

సరైన నిర్ణయం తీసుకోలేని పక్షంలో జీవితాంతం కుమిలి పోవాల్సి రావచ్చు... పెళ్లి విషయంలో మగవాడి ఎర్నింగ్ కెపాసిటీకి ఎంత ప్రాధాన్యత? కుటుంబ పోషణ విషయంలో స్త్రీకి ఎలాంటి భాగస్వామ్యం లేదనుకోవటం ఎంత సంకుచితం?

ఇది తన పెళ్లి విషయం... తనతో కూడా చర్చించాల్సిన విషయం... తన ప్రమేయం ఏ మాత్రంలేనట్లు తండ్రి ప్రవర్తించటం ఊర్మిళకు బాధగా వుంది. తన పెళ్లి ఫిక్స్ చేసేటప్పుడూ అంతే! ఎలాంటి సంబంధం చూడాలి... ఎవరికిచ్చి చేస్తే పిల్ల సుఖపడుతుందని తండ్రి తనకు తానుగా ఆలోచించి సంబంధాలు చూడటమేగాని తన అభిప్రాయానికి ఏమాత్రం విలువ లేదు.. చూసే వాళ్లకు మాత్రం, కూతురికి మంచి సంబంధం చెయ్యాలని ఆయనెంత తపన పడిపోతున్నాడోననిపిస్తుంటుంది...

తన పెళ్లి గురించి అన్ని ఆలోచనలూ తండ్రివే... అబ్బాయి ఇంజనీరో, డాక్టరో అవ్వాలి. అమెరికాలో ఉద్యోగం చేస్తూండాలి. అక్కడే భవిష్యత్తులో సెటిలైపోవాలి. తన కూతురికి అమెరికా సంబంధం చూసి చేశాడని ఆయన గురించి గొప్పగా ప్రచారం జరగాలి... ఘనతగా నలుగురూ చెప్పుకోవాలి...

పెళ్లిచూపులయ్యాక... ఫార్మల్‌గా తండ్రి వేసిన ఒకే ఒక ప్రశ్న... "అబ్బాయెలా వున్నాడమ్మా" అని? తను సమాధానం చెప్పకముందే... తన చుట్టూ ఒక ప్రచారం జరిగిపోయింది... హాండ్‌సమ్‌గా వున్నాడు పెళ్లి కొడుకంటూ. మెంటల్‌గా తనను ప్రిపేర్ చేశాక... వాళ్లు ఆశించిన సమాధానం తను చెప్పక తప్పదు...

అప్పుడు పెళ్లిసంబంధం కుదుర్చుకోవటంలో తన అభిప్రాయానికెంత విలువిచ్చారో ఇప్పుడూ అంతే. వాళ్లు ఎలా నిర్ణయిస్తే అలా జరుగుతుంది. పెళ్లి తనకే అయినా పెత్తనం మాత్రం పెద్దలదే.

వీళ్లంతా తన మంచి గురించే ఆలోచిస్తున్నారన్న భ్రమలో, బలహీనతతో, తనను తానే మోసగించుకుంటూ తనకంటూ ఒక వ్యక్తిత్వం లేకుండా ఎంతకాలం పడుండాలి?

"నాన్నా! సురేంద్రతో మాట్లాడాలి... ఫోన్ నంబర్ ఇస్తారా?" అడిగింది ధైర్యం చేసి.

నమ్మలేనట్లు చూశాడు పరాత్పరరావు.

"వాళ్లతో తెగతెంపులు చేసుకోవాలనుకుంటుంటే ఇంకా మాట్లాడాల్సింది ఏముంటుందమ్మా? మొదట్నుంచీ అమెరికా సంబంధం చేసుకోవాలని తాపత్రయం పడ్డాం. అతని ఉద్యోగం పోయాక, అమెరికా వెళ్లే అవకాశం లేకపోయాక ఇంకా ఆ సంబంధం పట్టుకుని వేళాడటం దేనికి? అనవసర ప్రయత్నం కాకపోతే."

"కేవలం అమెరికాలో ఉద్యోగమే అతనితో నా పెళ్లికి, భవిష్యత్తు జీవితానికి కీలకం కావటం విచిత్రంగా వుంది... ఇప్పుడన్నా నేనుగా ఆలోచించుకునే అవకాశం నాకివ్వండి నాన్నా" అందామె స్థిరంగా.

"ఇంకా ఆలోచించేది ఏంటమ్మా?"

"ఎంతసేపు నువ్వతని సంపాదన గురించే ఆలోచిస్తున్నావు... అంతకన్నా ముఖ్యం అతని వ్యక్తిత్వం. పెళ్లి చేసుకోబోతున్న వాళ్లకుండాల్సింది ఏ పరిస్థితుల్లోనైనా బ్రతకగలమన్న ఆత్మవిశ్వాసం... తన కాళ్ల మీద తాను నిలబడగలనన్న దృఢవిశ్వాసం" ఊర్మిళ మాటలకు పరాత్పరరావు మారుమాట్లాడకుండా ఫోన్ నంబరు ఇచ్చాడు.

* * *

పిజా కార్నర్‌లో, ఏ.సి చల్లదనం అనుభవిస్తూ... సురేంద్ర, ఊర్మిళలు ఒక మూలగా... ఎవరి ఆలోచనల్లో వాళ్లు మునిగి తేలుతూ... చర్చ ఎలా... ఎటునుంచి మొదలెట్టాలో తోచక... బిగుసుకుపోయి అపరిచితుల్లా... చాలాసేపు మౌనాన్ని పంచుకున్నారు... గిల్టీ ఫీలింగ్ సురేంద్ర మనస్సును అదిమి పట్టింది. సమాధానం చెప్పాల్సిన బాధ్యత తనమీదే వుందనుకున్నాడు.

"అయామ్ సారీ... మీ అందర్నీ మెంటల్‌గా టార్చర్ చేసినట్లున్నాను... ఇప్పుడు అమెరికాలో నాలాంటి వాళ్ల జీవితం పూల మీద నడక కాదు... కత్తిమీద సాములాంటిది. ఏరోజు ఎవరి ఉద్యోగం ఊడుతుందో చెప్పలేని దుస్థితి... అభద్రతా భావం... లాడెన్ అనబడే ఒక వ్యక్తి దుశ్చర్య యావత్ ప్రపంచాన్ని ఇంత దారుణంగా ఇన్‌ఫ్లూయెన్స్ చెయ్యటం విచారకరం. ఒక మహా విధ్వంసానికి కొన్ని నిమిషాలు చాలు. దాన్నుంచి ప్రపంచం కోలుకోవటానికి ఎంతకాలం పడుతుందో చెప్పటం కష్టం" భారంగా చెప్పాడు సురేంద్ర.

"మీ ఉద్యోగం పోయిన సంగతి పెళ్లికి ముందే చెప్పటం ఎందుకు?"

"పెళ్లి తర్వాత చెప్పటం అంటే... కావాలని మోసం చెయ్యటం... అదిష్టం లేక".

ఈ విషయంలో అతని నిజాయితీ పట్ల నమ్మకం కలిగింది ఊర్మిళకు. "ఈ పరిస్థితుల్లో ఫాల్స్ స్టేజికి పోయి అమెరికాలోనే బ్రతకాలని పాకులాడటం నాకు నచ్చలేదు.. బతకటం ముఖ్యం.. ఏం చేస్తేనేం.. ఆత్మాభిమానం చంపుకుంటూ, అక్కడే ఏదో పని చూసుకుని... దొడ్డిదారిలో బతికెయ్యొచ్చు... అదంతా నాకు ఆత్మవంచన అనిపించింది."

సురేంద్రలా ఓపెన్ మైండెడ్‌గా ఎంతమంది మాట్లాడగలరు? దొంగ వీసాలతో అమెరికాని ఆశ్రయించుకొని చిన్నా చితకా పనులు చేసుకుంటూ అక్కడ ఘనంగా బతుకుతున్నట్లు ఎందరు భ్రమలు కల్పించడంలేదు... తామేదో భూతల స్వర్గంలో వున్నట్లు ఎందరు గొప్పలు చెప్పుకోవడంలేదు...

"పెద్దవాళ్ల మీద మనం ఆధారపడకుండా... మనల్ని మనం పోషించుకోగలమన్న విశ్వాసం పెళ్లికి చాల ముఖ్యం అనుకుంటున్నాను" అన్నది ఊర్మిళ.

"నేను అమెరికాలో బయల్దేరుతూనే ఒక నిర్ణయానికి వచ్చాను. బెంగుళూరులో వున్న నా ఫ్రెండ్‌తో కాంటాక్ట్ చేసి జాబ్ గురించి ప్రయత్నించాను. విలాసవంతమైన జీవితం గురించి నేను హామీ ఇవ్వలేను గాని, కనీస జీవితావసరాలను సమకూర్చు కోవటంలో కాన్ఫిడెన్స్‌తోనే వున్నాను". చెప్పాడు సురేంద్ర.

ఓ గంటసేపు చాలా విషయాల మీద మనస్సు విప్పి మాట్లాడుకోగలిగారు. ఇద్దరూ కలిసే ముందు మనసుల్ని ఆవరించి వున్న శూన్యం, విడిపోయే ముందు లేదు. ఆత్మవిశ్వాసంతో ఒక అవగాహనకు రాగలిగారిద్దరూ.

* * *

"తోడు రావే ఊర్మిళా! ఫ్రెండ్స్‌కి ఇన్విటేషన్స్ ఇచ్చొద్దాం" అంటూ బయల్దేరిన ఊర్మిళను గమనించాక ఆమె నిర్ణయం ఏంటో పరాత్పరరావుకి, కౌసల్యకు ఇట్టే అర్థమైపోయింది.

ఊర్మిళ తనలాగా కాకుండా, స్వతంత్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికి రాగలగడం ఎంతో గర్వించేలా చేసింది కౌసల్యకు.

*(జయమ్ వారపత్రిక, 16.10.2002)*